అధికారులూ.. కబ్జాలు చూడరూ!



గతంలో ఫుట్‌పాత్‌ను కబ్జా చేశారిలా..



తాజాగా రోడ్డు మధ్యలో తవ్విన దృశ్యం

లాలాపేట: తార్నాక చౌరస్తాలో ఉన్న ఓ పెట్రోల్ బంక్ యజమాని యథేచ్ఛగా ప్రధాన రహదారిని ఆక్రమిస్తున్నాడు. నడి రోడ్డుపై గుంతలు తవ్వి చెట్లు పెట్టడానికి ఉపక్రమించాడు. దీంతో తార్నాక చౌరస్తాలో వాహనదారులకు ఇబ్బందిగా మారనుంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రా ంతంలో ఫుట్‌పాత్, రోడ్డు కబ్జా అవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. బంక్ పరిసర ప్రాంతాల వాసులు వాహనదారులు ఇదేమని అడిగితే దాడులకు సైతం పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

◆ గతంలో ఈ పెట్రోల్ బంక్ నిర్మాణ సమయంలోనే ఫుట్‌పాత్‌ను బంక్‌లోకి కలిపేసుకున్నారు. నాడు ఎవరూ ఏమనకపోవడంతో మరో అడుగు ముందుకేసి తాజాగా రోడ్డును కబ్జా చేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారుల మౌనం అనుమానాలు దారితీస్తున్నాయని వాహనదారులు చర్చించుకుంటున్నారు.

ఈ సారీ అదే తీరు!

ఓటింగ్‌కు దూరంగా 50 శాతం ఓటర్లు

- అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కదలని ఓటర్లు
- సనత్‌నగర్, సికింద్రాబాద్‌లో తగ్గుతున్న పోలింగ్



సనత్‌నగర్: పదే పదే అదే సీన్..ఎన్నికలు ఏవైనా ఓటర్లు మాత్రం పోలింగ్ కేంద్రం వరకు రావడానికి బద్ధకిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఎన్నో రకాలుగా వినూత్నంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నా సత్ఫలితాలు రాకపోవడం విడ్డూరం. ఫలితంగా పోలింగ్ శాతం అంతకంతకూ పడిపోతుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఏదైనా సరే సనత్‌నగర్ నియోజకవర్గంలో 60 శాతం పోలింగ్ కూడా నమోదు కావడం లేదు సరికదా..ఎన్నిక ఎన్నికకూ తగ్గుతూ రావడం గమనార్హం. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో 56.45 శాతం పోలింగ్ జరగ్గా, 2018 ఎన్నికల్లో 52 శాతానికి పడిపోయింది. అదే 2023 ఎన్నికల్లో 51.86 శాతం పోలింగ్ నమోదైంది. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో సైతం సనత్‌నగర్ నియోజకవర్గంలో 50 శాతం పోలింగ్ దాటలేదు. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ 50 శాతానికే ఆగిపోయింది.

తక్కువ పోలింగ్‌తో ఎవరికో మేలు..

అయితే.. తక్కువగా నమోదైన పోలింగ్ శాతం ఎవరికి కలిసివస్తుందోనని ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచిన ముస్లిం ఓటర్లు ఈ సారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారా? అన్నది రాజకీయ నేతలు లెక్కల్లో తలమునకలయ్యారు. ముస్లిం ఓటు బ్యాంక్ తమ ఖాతాలో పడిందంటూ కాంగ్రెస్ నేతలు చెబుతుండగా, తమ ఓటు బ్యాంక్ చెక్కు చెదరలేక పోవడంతో పాటు మోదీ పవనాలు బలంగా వీయడంతో తమ గెలుపు నల్లేరుపై నడక అంటూ బీజేపీ వర్గీయులు చెప్పుకుంటున్నారు. ఇక బీఆర్‌ఎస్ నేతలు సైతం గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఓటింగ్ సరళి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పునరావృతం అయ్యి సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. ముస్లిం ఓటు బ్యాంక్ తమతోనే ఉందని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు.

మైనారిటీ ఓట్లపై ఆశలు..

మరోపక్క ముస్లిం, మైనార్టీలు ఈ సారి తమ వైపే నిలువడంతో తమ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. సికింద్రాబాద్, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ రెండు వర్గాలు అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించడంతో కీలకపాత్ర పోషిస్తాయి. వీటికి తోడు ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఆరు హామీల వంటి సంక్షేమ పథకాలతో ప్రజలు తమ పార్టీకే పట్టం కట్టారని కాంగ్రెస్ శ్రేణులు ధీమాతో ఉన్నారు. మరో పక్క ప్రతి పోలింగ్ బూత్ వారీగా ఆయా పార్టీల ఏజెంట్లుగా పని చేసిన నాయకులు బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిని పరిశీలించిన నియోజకవర్గం స్థాయి నాయకులు తమ పార్టీ అభ్యర్థికి ఎంత మేర ఓట్లు పోలయ్యాయో అనే అంచనాలు వేస్తున్నారు. జూన్ ఒకటి వరకు మరో రెండు దశల్లో పోలింగ్ ఉన్నందున ఎగ్జిట్ పోల్స్ పై ఈసీ నిషేధం విధించింది. దీంతో అనేక మీడియా సంస్థలు ఈ ఎన్నికలకు సంబంధించిన సర్వే చేపట్టినా సర్వే రిపోర్టు మాత్రం బయట పెట్టలేని పరిస్థితి ఈ ఎగ్జిట్‌పోల్స్ అన్ని కూడా జూన్ ఒకటి సాయంత్రం బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దాంతో పాటు జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని ఆ రెండు సెగ్మెంట్లలో మెజారిటీ మాదే అని మూడు ప్రధాన పార్టీలు అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గ్రేటర్ పరిధిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే గెలవడం అందులో సికింద్రాబాద్, సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్లు కూడా ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థి సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ తన గెలుపు సునాయసమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాను సికింద్రాబాద్ సెగ్మెంట్ ప్రాతినిధ్యం వహిస్తుండగా తాను నివసించేది తన రాజకీయ జీవితం ప్రారంభించింది సనత్‌నగర్ నియోజకవర్గం కావడంతో ఇక్కడ మెజారిటీ వస్తుందని భావిస్తున్నారు. అదే విధంగా సిట్టింగ్ ఎంపీ జి.కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. గతంలో రెండు దఫాలు తప్ప వరుసగా బీజేపీ అభ్యర్థిగా బండారు దత్తాత్రేయ గెలుస్తూ రావడాన్ని బీజేపీ శ్రేణులు కొలమానం చూపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచినా పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ హవాతో మరోసారి విజయం సాధించబోతున్నామని ఆ పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా స్వామి వారికి 108 కలశలతో అభిషేకం చేయించారు. ప్రాణ ప్రతిష్ట మహా పూర్ణాహారతి అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్.నరేందర్ రెడ్డి, బొడ్డు కుమార్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

ఇచ్చిన డబ్బులు అడగడంతో ఘర్షణ

వ్యక్తిపై కత్తితో దాడి

అమీర్‌పేట: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో తలెత్తిన ఘర్షణలో కత్తితో దాడికి తెగబడిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్ అశోక్ కాలనీకి చెందిన మహ్మద్ అహ్మద్ ఖాన్ ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 11.30 సమయంలో మిత్రులైన ఖలీమ్, సయ్యద్ జాహిద్‌తో కలిగి టీ తాగేందుకు అమీర్‌పేటకు వచ్చారు. తిరిగి వెళ్తూ బీకేగూడ వద్ద కూరగాయల సంతలో నిమ్మకాయల వ్యాపారం చేస్తున్న అమీన్‌ను కలిశారు.అహ్మద్ ఖాన్ మిత్రుడైన ఖలీమ్ వద్ద గతంతో అమీన్ రూ.5 వేలు తీసుకున్నారు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో ఘర్షణ చోటు చేసుకుంది. అహ్మద్ ఖాన్, ఖలీమ్, జాహిద్ బైక్‌పై వెళ్లే ప్రయత్నంలో ఉండగా అమీన్ కత్తి తీసుకుని వారిపై దాడికి పాల్పడగా అహ్మద్‌ఖాన్ కత్తి పోట్లకు గురయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అమీన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బొట్టుబిళ్లలతో 'జై శ్రీరామ్'

రాముడిపై భక్తిని చాటుకున్న మహిళా కళాకారులు



బొట్టుబిళ్లలతో రూపొందించిన అయోధ్య ప్రాజెక్ట్ ఆవిష్కరిస్తున్న రూపకర్తలు..

పంజగుట్ట: రాముడిపై ఉన్న భక్తిని వినూత్నంగా చాటుకున్నారు ఆరుగురు మహిళలు. ప్రతీరోజు ఐదు గంటలు, మొత్తంగా 12 రోజులు ఎంతో నిష్టగా ఉంటూ 32,970 బొట్టు బిళ్లలతో 30/40 అట్టపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో జై శ్రీరామ్ అని రూపొందించారు. దీనికి అయోధ్య ప్రాజెక్ట్ అని పేరు పెట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అయోధ్య ప్రాజెక్టును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టును రూపొందించిన కాసుల పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి, ప్రతిభా ధల్, రజనీ మంచికంటి, కోమలి మాట్లాడుతూ.. ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ బ్యానర్‌పై దీన్ని రూపొందించినట్లు తెలిపారు. 16,314 నారింజ బొట్టుబిల్లలు, 3,192 నీలం బొట్టుబిల్లలు, 13,464 ఆకుపచ్చ బొట్టుబిల్లలతో దీన్ని తయారు చేశామన్నారు. ఏప్రిల్ 19న ఏకాదశి రోజు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మాంసాహారం తినకుండా, ఎంతో పవిత్రంగా ఉంటూ రూపొందించామని తెలిపారు. డిసెంబర్‌లో తమ బృందం అయోధ్యకు వెళ్లి అయోధ్య మ్యూజియంలో దీన్ని ఉంచనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని కాసుల పద్మావతి చిత్ర కళా అకాడమీలో ప్రతీరోజు 5 గంటలు కష్టపడి దీన్ని రూపొందించామని పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 28, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 8, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

కళాకారులకు వినయం అవసరం

- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్
- ఉగాది పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలు బాలలతో జస్టిస్ చంద్రకుమార్, రాము, ఎస్పీ భారతి

చిక్కడపల్లి: కళాకారులకు వినయం ఎంతో అవసరమని హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్రకుమార్ అన్నారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన రసమయి బాలల ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ కళలపై శ్రద్ధ వహిస్తే గుర్తింపు అదే వస్తుందని అన్నారు. ఈర్ష్య ద్వేషాలతో మనశ్శాంతిని కోల్పోతామన్నారు. ఈ సందర్భంగా నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, వీణ, ఛాయగ్రణం సృజనాత్మక కళల్లో ప్రతిభావంతులైన బాలలకు పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు రసమయి రాము అధ్యక్షత వహించిన సభలో కూచిపూడి నాట్యగురువు ఎస్పీ భారతి, రేణుక శ్రీనివాసులు, ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్ దారిలోనే...

ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్

పంజగుట్ట: గత పది సంవత్సరాల్లో జరిగిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాలను తెలుసుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అది కూడా అదే దారిలో పోతోందని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారులు తెలంగాణ విఠల్, పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఏ శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము గత సంవత్సరం డిసెంబర్ నాటికి 2.67 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గుర్తించామన్నారు.

18 నుంచి ఉచిత రాజయోగా శిక్షణ తరగతులు

వెంగళరావునగర్ : ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఉచిత రాజయోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ మధురానగర్ శాఖ నిర్వాహకులు ఎన్. రాధిక తెలియజేశారు. మధురానగర్‌కాలనీలోని డి–బ్లాకు పార్క్ సమీపంలో ఉన్న నిహారిక నిలయంలో ఈ తరగతులు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8, సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 99124 01733 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆరా తీస్తూ.. లెక్కలు వేస్తూ..!

- లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లపై నేతల మల్లగుల్లాలు
- ఖైరతాబాద్ కాంగ్రెస్ కంచుకోట అంటున్న నేతలు



స్థానిక నేతలతో దానం నాగేందర్

బంజారాహిల్స్: నెలన్నర రోజుల నుంచి అలుపెరగకుండా కార్యకర్తలు, నేతలతో కలిసి సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఇంటింటి ప్రచారం, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, ఆత్మీయ సమ్మేళనాలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. గెలుపే లక్ష్యంగా కంటి మీద కునుకు లేకుండా ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురడమే లక్ష్యంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోనే ఇక్కడ అత్యధిక మెజార్టీపై దృష్టిపెట్టారు. బీఆర్‌ఎస్ తోపాటు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలను భారీగా ఆకర్షించి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. దీంతో ఆయన ఖైరతాబాద్‌ను మరోసారి కాంగ్రెస్ కంచుకోటగా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు విజయవంతం అయినట్లుగా అంతా భావిస్తున్నారు. సోమవారం పోలింగ్ పూర్తికాగా మంగళవారం ఖైరతాబాద్‌లో ఎక్కడెక్కడ కాంగ్రెస్‌కు ఏ మేర ఓట్లు పడ్డాయనే దానిపై నేతలు, కార్యకర్తల ద్వారా లెక్కలు వేశారు. మైనార్టీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ సరళిని పరిశీలించి ఏమేరకు లాభిస్తుందో లెక్కలు వేసి చూసుకున్నారు. బస్తీలు సైతం ఓటింగ్‌కు పెద్ద ఎత్తున కదిలిరాగా ఈ ఓట్లు ఎవరి వైపు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.

పక్కా ప్రణాళికతో ప్రచారం..

ఖైరతాబాద్ నుంచే కాంగ్రెస్ విజయాలను నమోదు చేసుకుంటూ వెళ్లాలని నాగేందర్ పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహించారు. అందుకు అనుగుణంగానే ఖైరతాబాద్‌లో పావులు కదిపారు. భారీగా ఓటర్లను ఆకట్టుకున్నారు. ఎన్నికల ఫలితాల్లో ఆయన ప్రయత్నాలు ఏ మేరకు సఫలం అవుతాయో వేచి చూడాల్సి ఉంది. అయితే నేతలు, కార్యకర్తలు మాత్రం అంతటా కాంగ్రెస్‌కు పాజిటివ్‌గానే ఉందంటూ ఆయనకు లెక్కలు విడమర్చి చెప్పారు. ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు నమోదయ్యాయో వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారం, పోలింగ్ విరామం తరువాత ఆయన నేతలు, కార్యకర్తలతో ఫొటోలు దిగి సందడి చేశారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో సత్తా

సనత్‌నగర్: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. 97.8 శాతం మార్కులతో కారుమూరి అవినాష్‌రెడ్డి స్కూల్ టాపర్‌గా నిలువగా 96.8 శాతం మార్కులతో దమ్ములూరి హారిక ద్వితీయ స్థానం, 96.4 శాతం ఫలితాలతో శెట్టి దీక్ష తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్, ప్రిన్సిపాల్ రాధిక అభినందించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



షోహెబ్(ఫైల్)

బన్సీలాల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతూ..జీవితంపై విరక్తిచెంది ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం ..బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ ప్రాంతానికి చెందిన అబ్దుల్ షోహెబ్(20)కు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి రెండు కిడ్నీలు పాడైపోయాయి. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పని నుంచి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు హుటాహుటిన షోహెబ్‌ను కిందికి దించి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈవీఎంలకు 'స్ట్రాంగ్' భద్రత

- ఖైరతాబాద్‌లో 50.28, జూబ్లీహిల్స్‌లో 45.69 శాతం పోలింగ్
- స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు భద్రం
- భారీగా పోలీసు బందోబస్తు



బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సోమవారం జరిగిన పోలింగ్‌లో 50.28 శాతం ఓట్లు నమోదయ్యాయి. గత ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ ఎన్నికల్లో ఒక శాతం పోలింగ్ తక్కువగా నమోదైంది. కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతీ, యువకులు అంతా పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అంతటా భారీగా పోలింగ్ జరిగింది. ప్రశాసన్ నగర్ పోలింగ్ బూత్‌లో 1,374 ఓట్లకుగాను 834 ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ కాలనీలో ఈసారి ఎక్కువగానే పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ ప్రారంభంలో మందకొడిగా మొదలు కాగా క్రమంగా పుంజుకుంది. ఉదయం 11 గంటలకు పోలింగ్ 18.32 శాతం మాత్రమే ఉండగా, రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగగా 50.28 శాతం నమోదైంది.

స్ట్రాంగ్‌రూమ్‌లకు గట్టి భద్రత

ఈవీఎంలు పోలింగ్ బూత్‌ల నుంచి తరలించే ప్రక్రియ సోమవారం రాత్రి 8 గంటల నుంచి కొనసాగింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య రూట్ అధికారులు ప్రత్యేక బస్సులలో ఈవీఎంలను యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ ఏఆర్‌వో హేమంత్ బొర్కాడే, ప్రశాంతి, అనితారెడ్డి తదితరుల పర్యవేక్షణలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల వరకు ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచే ప్రక్రియ కొనసాగింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ నుంచి ఫిలింనగర్ వరకు ఉన్న 245 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రతనడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. అన్ని రూట్లలో పోలీసులు బందోబస్తు, పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడుగడుగునా గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఖైరతాబాద్‌లో
పోలింగ్ బూత్‌లు: 245

మొత్తం ఓటర్లు :	2,95,651
పురుషులు :	1,55,352
మహిళలు :	1,44,265
ఇతరులు :	34
పోల్ అయిన ఓట్లు :	1,50,653
పురుషులు	: 78,153
మహిళలు	: 72,490
ఇతరులు	: 10

తవ్వి ఏడాదైంది.. పూర్తికి ఎన్నాళ్లో?

సంవత్సరం నుంచి నిలిచిపోయిన సీసీ రోడ్డు

- రాకపోకలకు ఇబ్బందులు
- నిర్మాణం పూర్తి చేయాలంటున్న ఆర్యనగర్‌వాసులు
- విస్మరిస్తున్న అధికారులు



రోడ్డు తవ్వి వదిలేయడంతో మ్యాన్‌హోల్ పైకి తేలి రాకపోకలు సాగించలేని దృశ్యం

లాలాపేట: సీసీ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డంతా తవ్వారు. అంతలోనే డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం కొంత కాలం రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. తీరా పైపులైన్ నిర్మాణం పూర్తయ్యేసరికి సీసీ రోడ్డు నిర్మాణం చేయాల్సిన గుత్తేదారు పత్తాలేకుండా పోయారు. ఇలా దాదాపు సంవత్సర కాలం కావస్తుంది. అర్ధాంతరంగా నిలిచిపోయిన సీసీ రోడ్డు విషయమై స్థానికులు అధికారులను అడిగితే కాంట్రాక్టర్ స్పందించడం లేదంటూ నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని తార్నాక డివిజన్ ఆర్యనగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత కాలం గడుస్తున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తవ్విన రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని ఆర్యనగర్ వాసులు కోరుతున్నారు.

మట్టి దిబ్బలను తలపిస్తున్న రోడ్లు

రోడ్ల సమస్య తీరుతుందని భావించిన ఆర్యనగర్ వాసులకు సమస్య తీరకపోగా కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. బస్తీ అంతర్గత రోడ్లను ఇష్టానుసారంగా తవ్వడంతో బస్తీ రోడ్లన్నీ మట్టిదిబ్బలను తలపిస్తున్నాయి. ఈ రోడ్ల గుండా నిత్యం రాకపోకలకు కష్టతరంగా మారింది. వృద్ధులు, పిల్లలు రోడ్లపైకి రాలేని పరిస్థితి. పైకి తేలిన మ్యాన్‌హోల్‌తో రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యలపై గతేడాదిగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తమ కాలనీ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు వచ్చే నాయకులకే తమ మద్దతు ఉంటుందని ఆర్యనగర్ వాసులు స్పష్టం చేశారు.

నడవలేకపోతున్నాం..



తవ్వి వదిలేసిన రోడ్డుపై రాకపోకలు సాగించలేకపోతున్నాం. గుంతలమయంగా మారిన రోడ్డుపై మట్టితో నింపారు. ఈ ఎండా కాలం దుమ్ము లేస్తోంది. వాహనాలు వెళ్తున్న సమయంలో ఇళ్లలోకి దుమ్ము ఎగిసి పడుతుంది. వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలి.

– బాలమణి, స్థానికురాలు

అధికారులు చొరవ తీసుకోవాలి..



కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజాప్రతినిధులు తమ వద్దకు వస్తారు. ఆ తర్వాత ఇటు కన్నెత్తి చూడరు. దాదాపు సంవత్సర కాలం నుంచి సీసీ రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో పలుమార్లు మొర పెట్టుకున్నా స్పందించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలి. – సతీష్‌కుమార్, ఆర్యనగర్ వాసి

బీసీ కులవృత్తుల కార్పొరేషన్ అవసరం

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులవృత్తులను కాపాడాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంప్రు కుమారస్వామి కోరారు. క్రమంగా కులవృత్తులు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా సంప్రదాయ కులవృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నవారిని కాపాడటంతోపాటు ఆర్థికంగా చేయూతనివ్వటానికి బీసీ కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. గీత, నేత, కుమ్మరి, వడ్రంగి వంటి అనేక కులవృత్తుల వారు నేటికీ తమ జీవితాల్లో వెలుగు లేక ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని తెలిపారు. కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసి కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో జారీ చేయాలని కోరారు.

ఘనంగా భగీరథ జయంతి



బంజారాహిల్స్: నగరుల ఆరాధ్యదైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఫిలింనగర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జయంతి వేడుకల్లో పాల్గొని భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉప్పర సంఘం అధ్యక్షుడు మధుసాగర్, ప్రధాన కార్యదర్శి నాగేష్ సాగర్, నేతలు ఎస్పీ శ్రీను, ఆవుల రాజన్న, గుంటి వెంకటేష్, డి.వెంకటస్వామి, చీరల రామచంద్రయ్య సాగర్, జి. శాంతయ్య, కె. ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.